క్లుప్తంగా

పెన్షన్ బిల్లును ఉపసంహరించుకోవాలి

కామారెడ్డి అర్బన్: లోక్‌సభలో ప్రవేశపెట్టిన పెన్షన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారుడు జి.లచ్చయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాత, కొత్త పెన్షన్ విధానాలతో పెన్షనర్లను రెండుగా చీల్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పెన్షన్ విధానానికి తప్పుడు భాష్యం చెప్పి భవిష్యత్‌లో పెన్షన్ లేకుండా రద్దు చేయబోతుందని ఆయన ఆరోపించారు.

నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలి

కామారెడ్డి టౌన్: సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సొంటెం సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కళాకారులు తమ ఆటపాటలతో ఉద్యమాన్ని ఉద్రుతలూగించామని తెలిపారు. అయినా ప్రభుత్వం తమను విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాకారులు రాజలింగం, ఎల్లయ్య, దేవరాజ్ రెడ్డి, రాజయ్య, శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

నాగన్నగారి మెట్ల బావిలో పూడిక తీయించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావిలో పూడికతీత పనులు చేపట్టాలని డీఆర్డీవో సురేందర్ సూచించారు. బుధవారం ఆయన నాగన్నగారి బావిని సందర్శించి పరిశీలించారు. బావిలో నీరు పూర్తిగా అడుగంటిపోవడంతో ఉపాధి హామి పథకంలో కూలీతో పూడిక తీయించాలని ఎంపీడీవో నరేష్‌కు సూచించారు. ఎంపీవో మలహరి, ఏపీఎం శ్రీనివాస్ ఉన్నారు.

అదనపు కొనుగోలు కేంద్రాలు మంజూరు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో నూతనంగా సెర్ఫ్ ఆధ్వర్యంలో అదనపు కొనుగోలు కేంద్రాలు మంజూరైనట్లు ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ముంబోజిపేట, శెట్పల్లిసంగారెడ్డి, నల్లమడుగు, బాణాపూర్, కంచుమల్, కొర్పోల్, లింగంపేటలలో దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అయిలాపూర్, అయ్యపల్లి, నల్లమడుగు, భవానిపేట, పర్మళ్ల, శెట్పల్లి, లింగంపేటలలో సన్నరకం ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. బోనాల్, మెంగారం గ్రామాలకు నూతనంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్లు తెలిపారు.

గ్రంథాలయాలకు ఫ్రిడ్జ్‌ల విరాళం

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని భిక్కనూర్, దోమకొండ శాఖ గ్రంథాలయాలకు భిక్కనూర్‌కు చెందిన న్యాయవాది రాజాగౌడ్ వాటర్ కూలింగ్ ఫ్రిడ్జ్‌లను విరాళంగా అందజేశారు. పాఠకులకు చల్లని తాగునీరు అందించడానికి వాటర్ కూలింగ్ ఫ్రిడ్జ్‌లను అందజేసిన రాజాగౌడ్‌కు బుధవారం జిల్లా గ్రంథాలయంలో చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి జ్ఞాపికను అందజేసి శాలువాతో సన్మానం చేశారు.

నియామకం



నాగభూషణం

రాజంపేట: జాతీయ మానవ హక్కుల రాజంపేట మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కామారెడ్డి జిల్లా జాతీయ మానవ హక్కుల కమిటీ చైర్మన్ మహిపాల్ బుధవారం తెలిపారు. మండల చైర్మన్‌గా దండెం నాగభూషణం, కామారెడ్డి జిల్లా జాయింట్ సెక్రెటరీగా శనిశెట్టి సంతోష్ కుమార్‌ను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ప్రజా సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారం అయ్యే విధంగా చూడాలని సూచించారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలతో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పాదయాత్ర చేపట్టామన్నారు. పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి కారంగుల అశోక్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సిరాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు పోదర్ల రాజు, పిడుగు మమత, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్య నిర్వహణ

- పల్లెల ముఖం చూడని ప్రత్యేక అధికారులు
- రోడ్లపై ప్రవహిస్తున్న మురికి నీరు
- ఫాగింగ్ చెయ్యకపోవడంతో పెరుగుతున్న దోమలు



పిట్లంలోని ఓ ఇంటి ముందు ఆగిన మురికి నీరు

పిట్లం(జుక్కల్): పరిశుభ్రతకు నిలయాలుగా, ఆహ్లాదకర వాతావరణానికి మారుపేరుగా నిలవాల్సిన గ్రామాలు పారిశుధ్య లోపంతో అధ్వానంగా మారాయి. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోక, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పల్లెలు కంపుకొడుతున్నాయి. పిట్లం మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో మురికి నీరు నిలిచి రోడ్డుపై ప్రవహిస్తోంది. దుర్వాసన వస్తోందని, ఈగలు, దోమల బెడద పెరిగిందని ప్రజలు వాపోతున్నారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రభుత్వం అన్ని గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించింది. కానీ వారు కూడా ఆయా గ్రామాల ముఖాన్ని చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పలు గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్య సమస్యలు ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుయోగంగా మారాయి. పంచాయతీ అధికారులు చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడం లేదు. అదే విధంగా దోమల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని భావించి ఫాగింగ్ మిషన్‌లను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన వాటిని వాడకుండా మూలన పడేశారు. గ్రామాలలో ఫాగింగ్ చెయ్యకపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పందులు దొర్లుతున్నాయి



మా ఇళ్ల వద్ద మురికి కాలువలు నిర్మించలేదు. ఇంటి ముందు పెద్దమొత్తంలో మురికి నీరు ఆగుతున్నాయి. దీంతో దోమల బెడద ఎక్కువైంది. పెద్ద మొత్తంలో మురికి నీరు ఆగుతుండటంతో అందులో పందులు దొర్లుతున్నాయి. పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.

– సంగమేశ్వర్, పిట్లం

చెత్తతో నిండిపోయాయి



మా ఇంటి ముందు చెత్తాచెదారం పేరుకుపోతుంది. మురికి కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. దుర్వాసన వెదజల్లుతోంది. కాలనీలో మురికి కాలువలు తీసి చెత్తను తరలించాలని పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా చర్యలు చేపడితే బాగుంటుంది.

– సాజిద్, శాంతినగర్ కాలనీ, పిట్లం



అస్తవ్యస్తంగా ఉన్న మురికి కాలువ



రోడ్ల పక్కనే వేసిన చెత్తాచెదారం



నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డ్

కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళాసంఘాల సభ్యులు సమర్థవంతంగా నిర్వహించాలని నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుపై నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో బుధవారం మహిళాసంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాగిరెడ్డిపేట మండలంలో 11 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించారని తెలిపారు.రైస్‌మిల్లర్ల నుంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు బేస్త శాంత, ఐకేపీ ఏపీఎం జగదీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళులు



మాందాపూర్‌లో నివాళి అర్పిస్తున్న గౌడ సంఘం సభ్యులు



చిన్నమల్లారెడ్డిలో..

స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని గౌడ సంఘ ఆధ్వర్యంలో జిల్లాలో బుధవారం పలు చోట్ల నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వక్తలు గుర్తు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



బోర్లంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ సంగ్రాం నాయక్

బాన్సువాడ రూరల్: ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని బోర్లం సొసైటీ చైర్మన్ సంగ్రాం నాయక్ అన్నారు. బుధవారం డైరెక్టర్లు, గ్రామస్తులతో కలిసి బోర్లంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వైస్ చైర్మన్ రామలక్ష్మి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్ పరిధిలో..

నస్రుల్లాబాద్: మండలంలోని నస్రుల్లాబాద్, మైలారం, హాజీపూర్ గ్రామాలలో బుధవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ దుర్గం శ్యామల మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయిస్తే బోనస్ వస్తుందని గుర్తు చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పెరక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సొసైటీకే అప్పగించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పలు గ్రామాల్లో మహిళా సంఘాలకు అప్పగించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను యథావిధిగా సొసైటీకే అప్పగించాలని కోరుతూ పలువురు రైతులు బుధవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రాన్ని అప్పగించారు.

వారికి అప్పగించడం వల్ల ధాన్యం సేకరణలో తమకు ఇబ్బందులు కలుగుతాయని వారన్నారు. మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ వంశీగౌడ్‌తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద బుధవారం అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు, పూలమాలలతో ఆకర్షణీయంగా అలంకరించారు. అమ్మవారి ఆలయం చుట్టూ ఐదు సార్లు ప్రదక్షిణలు చేయించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలన



బాన్సువాడ రూరల్: నాగారంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించారు. పనులు పిల్లర్ల దశకు చేరాయని, బేస్‌మెంట్ నిర్మాణం పూర్తికాగానే రూ.లక్ష బిల్లును ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఇంకా పనులు ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి నవీన్‌గౌడ్ ఉన్నారు.

విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న పదిమంది బాలికలకు ఎస్‌బీఐ బ్యాంకు దేవునిపల్లి శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.80 వేల విలువ చేసే సైకిళ్లను డీఈవో రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కోసం ఎస్‌బీఐ కృషి చేస్తోందని రీజినల్ మేనేజర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు సిబ్బంది ప్రసాద్, రమణ, సుధా మాధురి, పాఠశాల హెచ్ఎం గంగాకిషన్ పాల్గొన్నారు.

పంట కాపాడుకునేందుకు 380 ఫీట్లు తవ్వించినా..





మైలారంలో 380 ఫీట్ల లోతు తవ్వించిన బోరు బావి వద్ద రైతు.. ఎండిన పంటను చూపుతూ..

- రెండు బోర్లు వేసినా కానరాని గంగమ్మ జాడ
- చివరి దశలో ఎండుతున్న పంట

నస్రుల్లాబాద్(బాన్సువాడ): వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. బోర్లు ఎత్తిపోయి పంటలు ఎండిపోతున్నాయి. నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామానికి చెందిన దడిగె గంగారాం తన సొంత పొలం మూడెకరాల్లో వరి పంట వేశాడు. భూగర్భ జలాలు అడుగంటడంతో ఉన్న బోరు ఎత్తిపోయి పంట ఎండుతోంది. పంటను కాపాడేందుకు మరో రెండు బోర్లు వేయడానికి రైతు సిద్ధమయ్యాడు. 380, 300 ఫీట్ల లోతుతో రెండు బోరు బావులు తవ్వించినా కూడా నీటి జాడ కనపడ లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంట ఎండిపోయింది. కాపాడడం కోసం రాక్షస ప్రయత్నాలు ఎన్ని చేసినా కూడా పంట మాత్రం కాపాడుకోలేక పోతున్నానంటూ వాపోతున్నాడు. పంట ఎండి పోయి బోరు బావులు తవ్వించడంతో రూ.3.50 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

'ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుందాం'



బాన్సువాడ: ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుందామని, వర్షపు నీటిని ఒడిసి పడదామని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు సూచించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడానికి ఇంకుడు గుంతలు అవసరమని, ప్రతీ ఒక్కరు ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, సిబ్బంది తుల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, విఠల్, మోహన్ ఉన్నారు.

అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారమివ్వాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలని ఎస్సై మహేందర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలల్లో చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారని, తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్నట్లు తెలిపారు. మేడలపై, ఆరుబయట పడుకున్నప్పుడు ఇంట్లో ఉన్న వస్తువులపై జాగ్రత్త వహించాలన్నారు. తాళం వేసి ఊరికెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రేషన్ దుకాణాల తనిఖీ



రాజంపేటలోని రేషన్ షాపులో సన్న బియ్యాన్ని పరిశీలిస్తున్న డీసీవో మల్లికార్జున్ బాబు



మద్నూర్‌లో.. తహసీల్దార్ ముజీబ్



పాల్వంచలో రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ హిమబిందు

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వం ఈ నెల 1 నుంచి సరఫరా చేస్తున్న సన్నబియ్యం ప్రజలందరికీ అందుతున్నాయా లేదా అని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా వ్యాప్తంగా పలు రేషన్ దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ప్రతి లబ్దిదారుడికి సన్న బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని రేషన్ డీలర్లకు సూచించారు. అదేవిధంగా డీలర్లు సమయ పాలన పాటించాలన్నారు.



కాటేపల్లిలో.. తహసీల్దార్ దశరథ్



వదల్‌పర్తిలో.. తహసీల్దార్ శ్రీనివాసరావు

ముగిసిన పదో తరగతి పరీక్షలు



ఎల్లారెడ్డిలో పరీక్షల అనంతరం చేతులను పైకెత్తి ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



గోపాల్‌పేట పరీక్షా కేంద్రం బయట విజయ కేతనం చూపుతున్న విద్యార్థినులు

పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. పరీక్షలు రాయడం అయిపోవడంతో విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.చివరి రోజు జరిగిన సోషల్ పరీక్ష ముగియగానే విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షాకేంద్రం నుంచి బయటకు పరుగులు తీశారు. స్కూళ్లలో హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న చాలా మంది విద్యార్థులు బుధవారం రాత్రే ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో హాస్టళ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇక ఫలితాలు రావడమే తరువాయి. పెద్దకొడప్‌గల్ పరిధిలో చివరి రోజు పరీక్షకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. – సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్తం

నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

రామారెడ్డి: గొల్లపల్లి ఎక్స్ రోడ్డులో బుధవారం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నందీశ్వర విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేసేందుకు భూమి పూజ చేశారు. వీడీసీ సభ్యుల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): కోమట్‌పల్లి, పోతాయిపల్లి గ్రామాల శివారులో కొనసాగుతున్న ఉపాధి హామి పనులను బుధవారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హజరు పట్టికలను తనిఖీ చేశారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పలువురు సెల్ ఫోన్లు పోగొట్టుకోవడంతో బాధితులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారు. రికవరీ చేసిన ఫోన్లను బాధితులు ఎల్లారెడ్డికి చెందిన నెల్లిజ్యోతి, రాజశేఖర్‌లకు బుధవారం ఎస్సై మహేష్ అందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మిర్జాపూర్‌లో బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులు పంపిణీ చేశారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ మారుతి, నాయకులు పురం వెంకటరమణ, శ్రీనివాస్, నర్సాగౌడ్, నాగ్‌నాథ్, కృష్ణ, పాల్గొన్నారు.

నిజాంసాగర్ పరిధిలో..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్, ముగ్దుంపూర్ గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. నాయకులు నాగభూషణంగౌడ్, ఖాలిక్, హన్మండ్లు, లవ్య సాయాగౌడ్ ఉన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

భిక్కనూరు: ప్రజలకు వైద్య సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని భిక్కనూరు పీహెచ్‌సీ వైద్యులు యెమిమా అన్నారు. బుధవారం ఆమె భిక్కనూరు మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంపీహెచ్ఈవో వెంకటరమణ, ఏఎన్ఎం శ్యామల, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

మర్కల్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్‌లో బుధవారం మహిళ డిగ్రీ గురుకుల కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ...మర్కల్ గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు తెలిపారు. శిబిరంలో భాగంగా గ్రామంలో శ్రమదానం, అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

మాచారెడ్డి: పోలంపల్లి శాంతానంద తపోవనాశ్రమంలోని రామాలయంలో శుక్రవారం నుంచి సీతారాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాజమౌళి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించాలని కోరారు.

12న బంగారు కొండ అంజన్నకు సిందూర పూజ

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్ సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కన గల బంగారు కొండ అంజనేయస్వామికి ఈనెల 12న శనివారం అభిషేకం, సిందూర పూజ, సామూహిక హన్‌మాన్ చాలీసా పారాయణం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.